

దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏఈవో పైడితల్లి

రైతు బీమాకు అవకాశం

- కొత్తగా నమోదైన రైతుల నుంచి 13 వరకు దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్ రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రైతుబీమా దరఖాస్తుల స్వీకరణను వ్యవసాయ శాఖ అధికారులు ఆదివారం నుంచి ప్రారంభించారు. కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్, మొగ్దుంపూర్, నగునూర్, చామనపల్లి, రైతు వేదికల్లో ఏఈవోలు రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరించారు. ప్రతి ఏటా ఆగస్టు 13 వరకు రైతు బీమా పథకం వర్తిస్తోంది. రైతు మృతి చెందితే కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుంది. గత నెలలో రైతు బీమా ప్రక్రియను ప్రారంభించాల్సి ఉండగా ఆలస్యం కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈనెల 13 వరకు అర్హులైన రైతులు దరఖాస్తులుచేసుకునేందుకు చివరి గడువుగా నిర్ణయించారు. కరీంనగర్ రూరల్ మండలంలో మొత్తం 13,043 పట్టాదారు రైతులు ఉన్నారు. గత సంవత్సరం రైతు బీమాకు సంబంధించి 54 మంది రైతుల సమాచారం సీసీఎల్ నుంచి రాలేదు. ఏఈవోల వద్ద 489 మంది రైతుల వివరాలు పెండింగ్‌లో ఉన్నాయి. 12,500 మంది రైతులకు మాత్రమే రైతు బీమా పథకం వర్తించింది. 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలు ఉన్న పాత రైతులకు బీమా పథకం యథావిధిగా రెన్యూవల్ చేస్తారు. దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్ పుస్తకం, రైతుతోపాటు నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌లను సంబంధిత ఏఈవోలకు రైతులు అందజేయాల్సి ఉంటుంది.



నిమిషాల్లో నేర చరిత్ర వెల్లడి

వేలిముద్రలతో నేరస్థుల సమాచారం

ఆరు నెలల క్రితం కరీంనగర్ బస్టాండ్ సమీపంలో ఒక దుకాణం తాళాన్ని ఒక పాతనేరస్థుడు పగులగొట్టి క్యాష్‌కౌంటర్‌లోని 25 వేల రూపాయలు దొంగిలించుకుపోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించగా నిందితుడు ముఖానికి మాస్క్ వేసుకుని వచ్చినట్లు సీసీ కెమెరాలో గుర్తించారు. క్లూస్ టీం సంఘటనా స్థలంలో సేకరించిన వేలిముద్రలను ఫింగర్‌ప్రింట్ పరికరానికి అనుసంధానం చేయగానే ఆ దొంగతనానికి పాల్పడింది పాత నేరస్థుడిగా వెల్లడైంది.

ఇటీవల పోలీసులు నగరంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఆర్టీసీ బస్టాండ్‌లో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి వేలి ముద్రలను సేకరించి ఫింగర్‌ప్రింట్ డివైస్ ద్వారా సరిపోల్చగా వారిద్దరు పర్సులు, సెల్‌ఫోన్‌లు, డబ్బులను దొంగిలించే పాత నేరస్థులుగా వెల్లడైంది. వెంటనే అదుపులోకితీసుకుని ముందస్తు చర్యగా బైండోవర్ చేశారు.

కట్టరాంపూర్‌లోని ఇంటి తాళం పగులగొట్టిన దొంగ బీరువాలోని బంగారంతో పాటు టీవీని కూడా ఎత్తుకుపోయాడు. బీరువాపై వేలిముద్రలతో దొంగను పోలీసులు పట్టుకున్నారు.

- ఫింగర్‌ప్రింట్ డివైస్‌తో నేరాలకు చెక్
- ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌పీ పరికరం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం కేసుల ఛేదనకు ఎంతో ఉపయోగపడుతోంది. ఫింగర్ ప్రింట్ డివైస్‌తో పోలీసులు నిందితులను పట్టుకుంటున్నారు. గతంలో ఏదైనా దొంగతనం, దోపిడీకి సంబంధించి పోలీసు రికార్డుల్లో కేసు నమోదైతే అతని వేలి ముద్రలను పోలీసుల వద్ద ఉన్న అధునాతన ఫింగర్ ప్రింట్ పరికరంకు అనుసంధానం చేస్తున్నారు. వారు తనిఖీల్లో దొరికినప్పుడు నేర చరిత్ర మొత్తం బయటపడుతుంది. ఏదైనా నేరం జరిగినప్పుడు క్లూస్ టీం సంఘటన స్థలంలో వేలి ముద్రలు సేకరిస్తుంది. వాటిని ఫింగర్‌ప్రింట్ డివైస్‌లో ఎంటర్ చేయగానే నేరుస్థుల గత చరిత్ర అంతా బయటకు వస్తుంది. ఈ పరికరాన్ని పోలీసులు విరివిగా వాడుతున్నారు. దొంగతనం, దోపిడీ వంటి నేరాలకు పాల్పడుతున్న నిందితులను పట్టుకునేందుకు ఫింగర్‌ప్రింట్ (పీఎఫ్) పరికరాన్ని రాత్రివేళ పోలీసు పెట్రోలింగ్ సమయంలో, కార్డన్‌సెర్చ్, ఆకస్మిక తనిఖీల్లో ఉపయోగిస్తున్నారు.


దర్యాప్తులో కీలకం

గతంలో మ్యానువల్‌గా చేసే వేలిముద్రల విశ్లేషణకు కొన్ని వారాల సమయం పట్టేది. ఆ తర్వాత కంప్యూటర్ల వాడకం ప్రారంభం అయినప్పటి నుంచి దీనికి రోజుల సమయం పట్టేది. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన పాపిలన్ పరిజ్ఞానంతో ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా లక్షలాది వేలి ముద్రలను కొన్ని క్షణాల్లోనే విశ్లేషించడం సాధ్యమవుతుంది. మొదట్లో ఘటన స్థలంలో దొరికిన వేలి ముద్రలను డేటాబేస్‌తో సరిపోల్చడానికి మాత్రమే ఈ డివైజ్‌ను వినియోగించారు. దీని ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ పరిజ్ఞానం కలిగిన చిన్న పరికరాలను గస్తీ పోలీసులకు అందజేశారు. మొబైల్ ద్వారా కూడా ఈ పాపిలన్ పరిజ్ఞానంతో కూడిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పోలీసులు వినియోగిస్తున్నారు. చేతిలో ఇమిడే ఈ పరికరం వారికి ఎంతో ఉపయోగకరంగా మారింది. చాలా మంది నిందితులు నేరం చేసినప్పటికీ పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతుంటారు. పోలీసులకు ఎదురుపడ్డప్పటికి ఈ నేరస్థులను గుర్తించడం కష్టంగా ఉండేది. ప్రస్తుతం అందుబాటులోకి ఇచ్చిన ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా ప్రతి అనుమానితుని వేలి ముద్రలను తీసుకుని అక్కడికక్కడే ఆ వ్యక్తి చరిత్రను తేలుస్తున్నారు. ఒక వేళ ఆ వ్యక్తికి పాత నేర చరిత్ర ఉంటే ఈ పరికరం ద్వారా వెంటనే తెలసిపోతుంది. ఇలా పాత నేరస్తుల నేరాల చిట్ట వెల్లడి కాగానే ఆ వ్యక్తులను సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించి తదుపరి చర్యను తీసుకుంటున్నారు. వేలిముద్రలను క్షణాల్లో విశ్లేషించి నేరస్తులను వేగంగా గుర్తించేందుకు ఉపయోగించే అత్యాధునిక

(మిగతా 8వ పేజీలో)

డేటా బేస్‌లో వేలిముద్రల వివరాల నిల్వ

నేరాల దర్యాప్తులో వేలి ముద్రల పరికరం పోలీసులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. దొంగతనాలు, దోపిడీ లు, ఇతర తీవ్రమైన సంఘటనల్లో నేరస్తుల నుంచి ఎప్పటికప్పుడు వేలిముద్రలను సేకరించి డేటాబేస్‌లో నిల్వ చేస్తారు. ఈ పద్ధతి రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. దీంతో పాతనేరస్థులు తనిఖీల్లో చిక్కితే ఆ నేరస్థుడు గతంలో ఎక్కడెక్కడ నేరాలకు పాల్పడ్డాడనేది వెల్లడవుతుంది. ఏదైనా నేరం జరిగిన స్థలంలో వేలి



ముద్రలు లభించినప్పుడు వాటిని డేటా బేస్‌లో ఉన్న వాటితో సరిపోల్చుతారు. ఒక వేళ పాత నేరస్తుడు ఆ నేరం చేసి ఉంటే పట్టుకోవడం సులభతరం అవుతున్నది.

ఇంకెన్నాళ్లీ కష్టాలు

- కల్వర్టుపైకి వరద నీరు
- పారువెల్ల-గన్నేరువరం మధ్య

నిలిచిన రాకపోకలు



లోలెవల్ కల్వర్టుపై ప్రవహిస్తున్న వరద నీరు

గన్నేరువరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఇంకా ఎన్నాళ్లు మాకు ఈ కల్వర్టు కష్టాలు అంటూ పారువెల్ల గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వరాకాలంలో పారువెల్ల నుంచి గన్నేరువరం వెళ్ళే ప్రధాన రహ దారిపై ఉన్న లో లెవల్ కల్వర్టుపై వరదనీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పారువెల్లలోని చెరువు నిండి మత్తడి దూకడంతో వరదనీరు కల్వర్టుపై ప్రవహిస్తూ గన్నేరు వరం చెరువుకు వచ్చి చేరుతోంది. ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కల్వర్టుపై రాకపో కలు నిలిచిపోయాయి. దీంతో పారువెల్ల గ్రామ ప్రజలు గన్నేరువరం చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాలని పారువెల్ల గ్రామస్థులు కోరుతున్నారు.

మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు



బోనాలతో ఆలయానికి వెళుతున్న మహిళలు

చిగురుమామిడి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉల్లంపల్లి శివారులో ఉన్న ఓదెల మల్లికార్జున స్వామికి శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం గ్రామ కుర్మగొల్ల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. గుట్టపైకి డోలు చప్పుళ్లతో బోనాలు తీసుకుని వెళ్లారు. గుట్ట పైన వెలిసిన స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. గుట్ట కింద ఉన్న ఆలయంలో పట్నం వేశారు. బొమ్మనపల్లి గ్రామానికి చెందిన యాదవులు స్వామి వారికి పెద్ద పట్నం వేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోల రవీందర్, సభ్యులు మేడుదుల కొమురయ్య, కత్తుల శివ, కత్తుల దేవేందర్, మ్యాదరవేణి ప్రవీణ్, కశరవేణి ఓదేలు, బుల్లి రంజిత్, ఆత్మకురి కనుకయ్య, రాజయ్య, బుల్లి సమ్మయ్య పాల్గొన్నారు.

నేడు సుడా వాణిజ్య సముదాయానికి శంకుస్థాపన

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్ టౌన్ సమీపంలో సుడా వాణిజ్య సముదాయ భవనానికి శంకుస్థాపన చేయనున్నట్లు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ హాజరవుతారన్నారు. రెండు దశల్లో నాలుగు కోట్ల రూపాయలతో సుడా వాణిజ్య సముదాయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్(పాత మున్సిపల్ గెస్ట్‌హౌస్)లో 79 లక్షల సుడా నిధులతో మౌలిక వసతులు, ఆధునీకరణ పనులకు సంబంధించి శంకుస్థాపన చేస్తారన్నారు. మంత్రులు సోమవారం ఉదయం 10 గంటలకు సుడా వాణిజ్య సముదాయం, 10:30 గంటలకు ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ పనులకు శంకుస్థాపన చేస్తారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు.



సుడా వాణిజ్య సముదాయం నమూనా

ఎల్ఎండీకి సందర్శకుల తాకిడి

- వాహనాలను దిగువకు వెళ్లకుండా కట్టడి చేసిన పోలీసులు

తిమ్మాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సెలవు రోజు వచ్చిందంటే చాలు కరీంనగర్ సమీపంలోని దిగువ మానేరు జలాశయం సందర్శకులతో కళకళలాడుతోంది. ఎల్ఎండీలో ప్రస్తుతం నీళ్లు తక్కువగా ఉన్నాయి. డ్యాం పరిసరాలు పచ్చిక బయళ్లతో అందంగా కనిపిస్తున్నాయి. గాలికి వచ్చే అలలు బీచ్‌ను తలపిస్తున్నాయి. సోషల్ మీడియాలో ఈ ప్రాంతాన్ని కరీంనగర్ బీచ్ అంటూ వైరల్ చేయడంతో సందర్శకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ ప్రాంతం ఓ పిక్నిక్ స్పాట్‌గా మారింది. సెలవు రోజుల్లో పెద్ద ఎత్తున వాహనాల్లో తరలివస్తు న్నారు. యువత వాహనాలను డ్యాం లోపలికి దింపి విన్యాసాలు చేస్తున్నారు. కొన్ని వాహనాలు ఇరుక్కుపోవడంతో ఎక్స్‌కావేటర్లతో తొలగించారు. కొన్నిసార్లు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి దీంతో పోలీసులు అప్రమత్తమై వాహనాలనుఅసలు కట్టపైకి రానివ్వకుండా కట్టడి చేశారు.



మానేరు నీటి వద్ద సందర్శకులు

ప్రమాదం అని తెలిసినా..

డ్యాంలో నీటి లోతు ఎక్కడ ఎలా ఉందో తెలియని పరిస్థితి. డ్యాంలో ప్రమాదవశాత్తు పడి ఎందరో ప్రాణాలు కోల్పోయారు. ఇంత జరుగుతున్నా కొందరు సందర్శకులు అవేవీ పట్టనట్టు చిన్నపిల్లల్ని కూడా డ్యాం నీటిలోకి దించి ఆడుతున్నారు. తక్కువ నీరు ఉన్న చోట కాకుండా ఎక్కువ నీరు ఉన్న చోటకు దిగి ఫోటోలకు ఫోజులు ఇస్తున్నారు. ఇక్కడికి సందర్శకులు కొద్ది సేపు సరదాగా గడిపేందుకు వస్తే కొంత మంది మందుబాబులు మద్యం తాగుతూ ఇతరులను ఇబ్బంది పెడుతున్నారు. వారు మద్యం సేవించి బాటిళ్లను పగలగొట్టి ఎక్కడ పడితే అక్కడ పడేసి వెళుతున్నారు. మత్స్యకారుల తెప్పు, వలలను ధ్వంసం చేస్తున్నారు.

'మహాలక్ష్మి'తో ఆర్టీసీకి కాసుల పంట
- మహిళలకు ఉచిత ప్రయాణంతో సంస్థకు ఆదరణ
- రీజియన్ వ్యాప్తంగా రూ.721.35 కోట్ల ఆదాయం

7

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి



అంబేద్కర్ చౌక్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

భగత్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. కరీంనగర్ అంబేద్కర్ చౌక్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం చట్టం చేసి వెంటనే కేంద్రం అమలు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి ఆమోదం కోసం పంపించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీలను మోసం చేస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయకుండా రిజర్వేషన్లకు మతం రంగు పులుముతున్నదన్నారు. బీసీ రిజర్వేషన్లపై సీపీఎం రాష్ట్ర వ్యాప్తంగా పోరాడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టులు చేస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీకి బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేనట్లు కనిపిస్తున్నదన్నారు. కార్యక్రమంలో గుడికందుల సత్యం, భీమా సాహెబ్, కోనేటి నాగమణి, తిప్పారపు సురేష్, గజ్జల శ్రీకాంత్, పుల్లెల మల్లయ్య, సాగర్, కండె రాజు, సాయికుమార్, శ్రీనివాస్, సందేశ్, ఇస్సాక్ పాల్గొన్నారు.

కొడుకు మరణం తట్టుకోలేక.. తండ్రి ఆత్మహత్య


బాలేశ్వర్‌రెడ్డి(ఫైల్)

ముస్తాబాద్, అగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకోడ్ గ్రామానికి చెందిన బాలేశ్వర్‌రెడ్డి(52) అనేవ్యక్తి కొడుకు మరణం తట్టుకోలేక మనోవేద నతో శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గణేశ్ తెలిపిన వివ రాల ప్రకారం.. గూడు బాలేశ్వర్‌రెడ్డి, మమత దంపతల కుమారుడు సంకీర్త్ క్యాన్సర్ వ్యాధితో రెండేళ్ల క్రితం చనిపోయాడు. కొడుకు మరణం తట్టుకోలేక తరుచుగా బాలేశ్వర్‌రెడ్డి బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో ఆరోగ్యం క్రమక్రమంగా క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన బాలేశ్వర్‌రెడ్డి తన ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు బాలేశ్వర్‌రెడ్డి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నరేశ్(ఫైల్)

ముస్తాబాద్, అగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన కొప్పు నరేశ్ (27) అనే యువకుడు శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం పోతుగల్ గ్రామానికి చెందిన కొప్పు నరేశ్ ముస్తాబాద్‌కు ద్విచక్రవాహనంపై వచ్చి పెట్రోల్ పోసుకొని వెళ్తున్నాడు. హనుమాన్ టెంపుల్ నుంచి వెళుతుండగా ఎదురుగా రోడ్డుపై పార్కింగ్ చేసిన బోర్‌వెల్ లారీ డ్రైవర్ ఎలాంటి ఇండికేటర్స్ వేయకుండా రోడ్డు మీద పార్కింగ్ చేశాడు. ఈక్రమంలో బోర్‌వేల్ లారీని నరేశ్ ద్విచక్రవాహనం ఢీకొట్టింది. నరేశ్ తలకు, కడుపులో తీవ్రగాయాలుగా కాగా సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టున ఎస్సై తెలిపారు.

రాజస్థాన్‌కు చెందిన వివాహిత ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని కొత్తపల్లి వద్ద వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలో పనిచేస్తున్న రాజస్థాన్‌కు చెందిన వివాహిత శారద(22) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. వినాయకుడి విగ్రహాలు తయారుచేసేందుకు కూలగా శారద, ఆమెభర్త స్థానికంగా గదిలో ఉంటున్నారని, శనివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు.. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. శారద ఆత్మహత్యకు సంబంధించి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీగదిలో భద్రపరిచారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొంపల్లి శివారులో కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కారు అతి వేగం వల్ల ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు పేర్కొన్నారు. స్థానికుల సమాచారం మేరకు గాయాలైన యువకుడిని 108 వాహనంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పెద్దపల్లి రూరల్ పోలీసులు విచారణ చేపడుతున్నారు.

మేమేమి చేశాము పాపం..

- నాలుగు నెలలుగా కళాకారులకు అందని పెన్షన్
- భారమవుతున్న కుటుంబపోషణ
- ప్రభుత్వం, నాయకులు ఆదుకోవాలని వేడుకోలు


చిందు యక్షగాన కళాకారులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సంగీతాన్ని అందించే వాయిద్యాలు మూగ బోయాయి. తాళాలు శృతి తప్పాయి. రక్తికట్టించే గజ్జెల సవ్వడి ఆగిపోయింది.. గదలు, బా ణాలు, ఖడ్గాల విన్యాసాల గతులు తప్పాయి. నాట్యం, పాట, నాటకం, పలు కళలు ఆహార్య అభినయాలు అంతరించిపోయాయి. ఉమ్మడి జిల్లాలో 55 సంవత్సరాలు దాటిన సుమారు 25 కళలకు చెందిన పెన్షన్‌కు అర్హులైన దాదాపు 50 నుంచి 60 మంది కళాకారులున్నారు. వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. యక్షగానంతో పాటు వీధి, గంటె భాగవతులు డప్పు, ఒగ్గు, బుర్ర, హరికథలు వంటి 25 కళలకు చెందిన కళాకారులకు నాలుగు నెలలుగా పెన్షన్ అందడం లేదు. దీంతో కుటుంబ పోషణ కోసం పలువురు కళాకారులు కూలీలుగా మారారు. కొందరు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడ్డారు. మే వరకు 3 నెలలకొకసారి 3 వేల చొప్పున పెన్షన్ ఇచ్చారు. తరువాత పెన్షన్ నిలిచిపోవడంతో కళాకారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


ఒగ్గుకథ చెబుతున్న కళాకారులు

● కళాకారుల డిమాండ్లు

ప్రభుత్వం తరుపున కార్యక్రమాలను ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని కళాకారులు కోరుతున్నారు. సంఘ భవనాన్ని నిర్మించి పెన్షన్ ప్రతినెలా అందేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇళ్ల మంజూరు చేయాలంటున్నారు. కొత్త ప్రభుత్వం, నాయకుతోనైనా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం ఆదుకోవాలి...

- గజవెల్లి కిష్టయ్య, చిందు యక్షగాన కళాకారుడు



ఒకప్పుడు మా యక్షగాన, కళా ప్రదర్శనలతో కుటుంబంలోని అందరికి ఉపాధి దొరికింది. ఇప్పుడు ఆదరణ కరువయింది. మమ్మల్ని ముఖ్యమంత్రి ఆదుకోవాలి.

ఆసరాగా నిలవాలి...

- ఈరు రాజమల్లయ్య, ఒగ్గు కళాకారుడు



మేం ఒగ్గు కథ చెబుతాం. కళాకారులకు సకాలంలో పెన్షన్ అందజేసి ఆసరాగా నిలవాలి. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి.

మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నవజాత శిశువు మృతి

● సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ


ఆసుపత్రిలో రోదిస్తున్న శిశువు తల్లి ప్రేమలత, కుటుంబ సభ్యులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున నవజాత శిశువు మృతిచెందింది. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మహరాజు ప్రేమలత పురిటినొప్పులతో గురువారం జగిత్యాలలోని మాతాశిశు సంరక్షణ కేంద్రానికి వచ్చింది. శుక్రవారం మగబిడ్డకు జన్మనిచ్చింది. శనివారం నుంచి బాబు సరిగా పాలు తాగడం లేదని విధులు నిర్వ హిస్తున్న నర్సుల వద్దకు వెళ్లితెలిపినప్పటికీ వారు నిర్లక్ష్యం వహించడంతో శిశువు అపస్మారక స్థితి లోకివెళ్లి మృతి చెందినట్లు బంధువులు ఆరో పించారు. వైద్య సిబ్బంది సకాలంలో స్పందించి ఉంటే తనబిడ్డ దక్కేవాడని తల్లి ప్రేమలత రోదిస్తూ తెలిపింది.


మృతిచెందిన శిశువు

విధుల్లో నిర్లక్ష్యం వహించిన నర్సులపై చర్య తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. కాగాశిశువుకు పాలు పట్టించిన తర్వాత భుజంపై వేసుకోకుండా నిద్రపుచ్చడం వల్లనే శిశువు మృతి చెందినట్లు విధుల్లో ఉన్న నర్సులు తెలిపారు.

●విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం...

నవజాతశిశువు మృతి సంఘటనపై విచారణ జరిపిచర్యలు తీసుకుంటామని మాతా శిశు సంరక్షణ కేంద్రం సూపరింటెండెంట్ జి. కృష్ణమూర్తి తెలిపారు. శిశువు ఆరోగ్య పరిస్థితిపై అతడి బంధువులు వచ్చిచెప్పినప్పటికీ విధుల్లోఉన్న వైద్యుడికి సమాచారం అందించకుండా నిర్లక్ష్యం వహించడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి


రామస్వామి(ఫైల్)

కోనరావుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన కుంటెల్లి రామస్వామి(40) అనేరైతు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోపడి మృతి చెందాడు. గ్రామస్థులకథనం ప్రకారం గ్రామానికి చెందిన రామస్వామి ఉదయం తన పొలానికి నీరు పెట్టడానికి వెళ్లాడు. ఈక్రమంలో విద్యుత్ స్టార్టర్ బావిపక్కనే ఉండడంతో కరెంటు పెట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడ్డాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం వెళ్లిన రామస్వామి రాత్రి వరకు కూడా ఇంటికి రాకపోవడంతో భార్య కొమురవ్వ, కుమారుడు అరవింద్ అనుమానం వచ్చి బావి వద్దకు వెళ్లి చూసేసరికి బావిలో శవమై కనిపించాడు. ఈ విషయమై కోనరావుపేట పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్‌ఐ తిరుమల్ సంఘటనస్థలానికి చేరుకొని మృతదేహాన్ని గ్రామస్థుల ద్వారా బయటకు తీయించి ప్రమాదానికి గల కారణాలు పరిశీలిస్తున్నారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి

తిమ్మాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే కరీంనగర్ సుభాష్‌నగర్‌కు చెందిన కామారపు అనిల్‌కుమార్(36) ఆదివారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎల్‌ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామా రపు అనిల్‌కుమార్ సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కాని స్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అనిల్ కుమార్ తన సన్నిహితులకు కొంతడబ్బు అప్పుగా ఇచ్చాడు. డబ్బును తిరిగి ఇవ్వాలని సన్నిహితులను కోరగా ఇవ్వకపోగా వేధింపులకు గురి చేశారు. దీంతో మనస్థాపానికి గురైన అనిల్‌కుమార్ జూలై31న అలుగునూర్ శివారులో పురుగుల మందు తాగి ఇంటికి వెళ్లాడు. గమనించిన కుటుంబసభ్యులు అనిల్‌కుమార్‌ను చికిత్సకోసం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం అనిల్ కుమార్ మృతిచెందాడు. మృతుడు అనిల్‌కుమార్ తండ్రి కామారపు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు నమోదు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన మేకమల్ల ఐలయ్య అనేవ్యక్తి తనను అదే గ్రామానికి చెందిన లచ్చయ్య కులం పేరుతో దూషించాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

వదినపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

మల్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దిగువ కొండగట్టులో వదినపై దాడి చేసిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. జుంగోని వెంకటేశ్ అనే యువకుడు వదినతో తరచూ గొడవ పడడమే కాకుండా ఆదివారం ఇంట్లోకి వచ్చి దూషిస్తూ దాడి చేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేయగా వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్రామాల సరిహద్దు వివాదం

- బోర్డుల తొలగింపు వివాదాస్పదం
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- ఏళ్లుగా నూకపల్లి, రామన్నపేట గ్రామాల మధ్య పంచాయితీ


మల్యాల సీఐ రవికి ఫిర్యాదు చేస్తున్న రామన్నపేటవాసులు

మల్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని నూకపల్లి, రామన్నపేట గ్రామాల మధ్య సరిహద్దు వివాదం కొన్నేళ్లుగా కొనసాగుతుండగా తాజాగా ఆదివారం రామన్నపేట వాసులు మల్యాల సీఐ నీలం రవికి ఫిర్యాదు చేశారు. నూకపల్లి, రామన్నపేట గ్రామాలు 1978లో ఏర్పడగా నూకపల్లి గ్రామాన్ని రెవెన్యూ పంచాయతీగా పేర్కొన్నారు. నూకపల్లి రెవెన్యూ పంచాయతీ గ్రామం కింద నూకపల్లితో పాటు రామన్నపేట చేర్చారు. ఇక్కడే రెండుగ్రామాల మధ్య పంచాయితీ ఏర్పడింది. కరీంనగర్-జగిత్యాల మార్గం దీని పరిధిలోనే ఉండగా మల్యాల క్రాస్‌రోడ్డు నుంచి రాజారం వరకు విలువైన భూములు ఉన్నాయి. దీంతో గతంలో సర్వే నంబర్ల ఆధారంగా రెండు గ్రామాలకు కేటాయించుటకు నిర్ణయించారు. ఇందులో భాగంగా మల్యాల క్రాస్ రోడ్డు ప్రాంతంకు మల్యాలవైపు రామన్నపేట, నూకపల్లి వైపు నూకపల్లి గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో సర్వే నంబర్ల ఆధారంగా ఇంటి అనుమతులు ఇస్తున్నారు. అయితే తాజాగా మల్యాల క్రాస్ సమీపంలోని పెట్రోల్ పంప్ యజమాని పంప్ పక్కనే కల్యాణ మండపం నిర్మించి ఆదివారం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసుకొని బోర్డుపై రామన్నపేటగా పేర్కొన్నాడు. దీంతో నూకపల్లి గ్రామస్థులు శనివారం అక్కడకు వెళ్లి తమ పరిధిలో ఉన్నందున రామన్నపేట గ్రామ పేరు తొలగించాలని అనడంతో ఆ పేరు తొలగించి మల్యాల క్రాస్ రోడ్డుగా పేర్కొన్నారు. రామన్నపేట పేరు తొలగింపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆదివారం గ్రామస్థులు ప్రారంభోత్సవ కార్యక్రమం వద్దకు వెళ్లి యజమానితో గొడవకు దిగారు. నిర్మాణానికి తమ గ్రామపంచాయతీ అనుమతి ఉన్నందున రామన్నపేట పేరు మార్చాలని యజమాని కొత్త సురేశ్‌ను కోరారు.

తనకు రెండు రోజులు అవకాశం ఇవ్వాలని కోరడంతో అక్కడ నుంచి వెళ్లారు. అంతకు ముందు బోర్డు తొలగింపుపై నూకపల్లి గ్రామస్థులపై రామన్నపేట వాసులు మల్యాల సీఐ నీలం రవికి ఫిర్యాదు చేశారు. భయభ్రాంతులకు గురి చేసి బోర్డు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమీపంలోని సూపర్‌మార్కెట్, వీఆర్‌కే కళాశాల పేర్లు కూడా మార్చాలని నూకపల్లి గ్రామస్థులు హెచ్చరించారని రామన్నపేట వాసులు సీఐకి వివరించారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

● 30 కార్ల అద్దాలపై బ్లాక్ ఫిల్మ్ తొలగింపు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ట్రాఫిక్ పోలీసులు ఆదివారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. కార్లకు బిగించుకున్న బ్లాక్ ఫిల్మ్‌లను టింట్ మీటరుతో తొలగించారు. 30కార్ల యజమానులకు జరిమానా విధించారు. అనంతరం వాహనాల యజమానులకు కరీంనగర్ ట్రాఫిక్‌సీఐ కరీం ఉల్లాఖాన్ కౌన్సెలింగ్ నిర్వహిచారు. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం కార్లు, ఇతర వాహనాల అద్దాలపై బ్లాక్ ఫిల్మ్ వేయొద్దన్నారు. కార్ల అద్దాలు షోరూం నుంచి వచ్చిన విధంగానే ఉండాలని, అదనపు ఫిల్మ్‌లు వేయరాదని అన్నారు. ట్రాఫిక్‌నిబంధనలు ఉల్లంఘించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాలు, నేరఘటనలు నియంత్రించేందుకు ముందస్తుగా నిర్వహిస్తున్న తనిఖీలు, ఇతరచర్యలకు నగర ప్రజలు సహకరించాలని కోరారు. ఆర్ఐ కుమారస్వామి, ఎస్సై ఇషాక్ అహ్మద్, ఆర్ఎస్సై సురేష్ పాల్గొన్నారు.


బ్లాక్ ఫిల్మ్ తొలగించి, వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కరీం ఉల్లఖాన్, ఆర్ఐ కుమారస్వామి

మంచినీరు ఇవ్వడం లేదని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన


వాటర్ ట్యాంక్ ఎక్కిన తిప్పని శ్రావణ్

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాఫర్‌ఖాన్ పేట గ్రామంలో ఆదివారం సాయంత్రం మాజీ వార్డు మెంబర్ తిప్పని శ్రావణ్ గ్రామానికి మంచినీరు ఇవ్వడం లేదని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపాడు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌లో నిండా నీరు ఉన్నా గ్రామానికి మంచినీరు ఇవ్వక ఇబ్బంది పెడుతున్నారన్నారు. గ్రామస్థులు వాటర్ ట్యాంక్ దిగిరావాలని కోరగా, శాంతించిన ఆయన దిగిరావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఎక్స్‌కవేటర్ సీజ్

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సపల్లి గ్రామశివారు నుంచి మట్టిని తరలిస్తున్నారంటూ రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తరలిస్తుండగా, వాటిని సీజ్‌చేసినట్లు తహసీల్దార్ కనుకయ్య తెలిపారు. అక్రమంగా ఎవరైనా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెట్‌పల్లి ఏఎంసీ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

- పెద్దఎత్తున గోనె సంచులు దగ్ధం
- రూ.30 లక్షల ఆస్తి నష్టం

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలోని గోదాంలో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు మూడు లక్షల గోనె సంచులు దగ్ధమై రూ.30 లక్షల ఆస్తి నష్టం జరిగింది. మార్కెట్ యార్డులోని గోదాంను సివిల్ సప్లయిస్ వారు అద్దెకు తీసుకొని 2018 సంవత్సరం నుంచి ఐదు లక్షలకు పైగా గోనె సంచులను నిలువ చేశారు. ఆదివారం ఉదయం గోదాంలో నుంచి పొగ రావడాన్ని స్థానికులు గమనించి గోదాం ఇన్‌చార్జి బూరం సురేష్‌తోపాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. మంటలు భారీగా వ్యాపించడంతో జగిత్యాల, నిర్మల్, భీంగల్, కమ్మర్‌పల్లి కేంద్రాల నుంచి అగ్నిమాపక వాహనాలను రప్పించి మంటలను ఆర్పడానికి యత్నించారు. అయినా గోదాంలో నుంచి దట్టమైన పొగతో మంటలు ఎగిసిపడడంతో ఎల్‌సీఎస్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్‌లు ఆధ్వర్యంలో మూడు ఎక్స్‌కవేటర్లతో గోదాం గోడలను బద్దలుకొట్టి దగ్ధమవుతున్న గోనె సంచులను బయటకు తీసి ఆర్పి వేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి తొమ్మిది గంటలపాటు శ్రమించారు. సంఘటన స్థలాన్ని ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రాములు, తహసీల్దార్ నీత, సివిల్‌సప్లయిస్ డీఎం జితేందర్‌ప్రసాద్ పరిశీలించారు. సుమారు రూ.30 లక్షల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని సివిల్ సప్లయిస్ డీఎం జితేందర్‌ప్రసాద్ తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు స్పష్టంగా తెలియకపోవడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రతి సంవత్సరం కోట్లల్లో ఆదాయం వచ్చే మార్కెట్ యార్డుకు కనీసం వాచ్‌మెన్ కూడా లేకపోవడంపై ఏఎంసీ అధికారుల నిర్లక్షం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేశారు.


గోదాంలో దగ్ధమవుతున్న గోనె సంచులు


మెట్‌పల్లి ఏఎంసీలోని గోదాంలో మంటలను ఆర్పేందుకు ఎక్స్‌కవేటర్‌తో గోడను కూల్చుతున్న సిబ్బంది

పాన్‌షాప్ నిర్వాహకుడిపై జులాయిల దాడి

● అదుపులోకి తీసుకున్న పోలీసులు

కోల్‌సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): షాపు ముందు సిగరెట్ తాగవద్దన్నందుకు నలుగురు జులాయిలు పాన్‌షాప్ నిర్వాహకుడిపై దాడి చేసిన ఘటన ఆదివారం గోదావరిఖని మార్కండేయకాలనీ జంక్షన్‌లో జరిగింది. శ్యామ్ అనే పాన్‌షాపు నిర్వాహకుడి వద్దకు వచ్చిన నలుగురు యువకులు సిగరెట్ తీసుకుని షాపువద్ద తాగుతుండగా అతడు అడ్డు చెప్పాడు. దీంతో కౌంటర్‌లోని డబ్బులు లాక్కున్న యువకులు అతనిపై విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారు. అడ్డువచ్చిన ఇతర షాపుల వారిపై కూడా దౌర్జన్యానికి పాల్పడుతూ పిడిగుద్దులు గుద్దారు. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద గొడవ జరుగుతున్నా స్థానికులు స్పందించలేదు. పోలీసులకు సమాచారం అందడంతో సీఐ ఇంద్రసేనారెడ్డి, పోలీసులు వెంటనే స్థలానికి చేరుకుని గొడవకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారు మద్యం మత్తులో ఉన్నట్టు స్థానికులు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

తిమ్మాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎల్‌ఎండీ పోలీసులు పట్టుకున్నారు. మానకొండూర్ మండలం లింగాపూర్‌లోని వాగునుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అలుగునూర్ శివారులో పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. అదేవిధంగా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో గల మోయతుమ్మెద వాగు నుంచి సైతం అనుమతి లేకుండా ఇసు కను తరలిస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్‌ను కొత్తపల్లి శివారులో పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. పట్టుకున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి యాజమానులు తాళ్ల సంతోష్, గుంటక రాజు, డ్రైవర్లు తాళ్ల ప్రశాంత్, న్యాలం చందుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ధర్మపురి శివారులో చిరుత పులి సంచారం

● అప్రమత్తంగా ఉండాలంటున్న అటవీ అధికారులు

ధర్మపురి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణ శివారులో గల పోచంపుంపు వ్యవసాయ భూముల్లో చిరుత పులి సంచారం కలకలం సృష్టించింది. రెండు రోజుల క్రితం వ్యవసాయ పనులకు వెళ్లిన ఒక వ్యక్తికి చిరుత పులి పిల్ల కనిపించడంతో భయంతో పరుగులు తీశాడు. పట్టణ శివారులో గల పోచంపంపు, ఇతరత్రా వ్యవసాయ భూములకు పెట్రోల్ బంక్ పక్క నుంచి ఎడ్ల బండ్ల దారి, కమలాపూర్ దారి గుండా నిత్యం అనేక మంది రైతులు, వ్యవసాయ కూలీలు పనులకు వెళ్తుంటారు. వ్యవసాయ పనులకు వెళ్లిన వ్యక్తికి చిరుత పులి కనిపించడంతో స్థానిక అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీ శాఖ అధికారులు ఆదివారం పరిసర ప్రాంతాల్లో కాళ్ల పాద ముద్రల కొలతలు తీసి చిరుత పులి అడుగులుగా భావిస్తున్నట్లు తెలిపారు. పోచంపంపు వ్యవసాయ భూముల్లో చిరుత పులి సంచరించినట్లు కొందరు వ్యక్తులు అటవీ శాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు నేరెళ్ల అటవీ బీట్ అధికారి జీవన్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం వెళ్లి చిరుత పులి సంచరించిన ప్రదేశాల్లో కాళ్ల వేలి ముద్రల కొలతలు తీసుకున్నట్లు తెలిపారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు గుంపులు గుంపులుగా వెళ్లాలని ఆయన అన్నారు. సాయంత్రం 4 గంటల లోపుగా పనులు ముగించుకుని రైతులు, వ్యవసాయ కూలీలు తిరిగి ఇంటికి రావాలని ఆయన సూచించారు.


ధర్మపురి శివారులో గల పోచం పుంపు వ్యవసాయ భూముల్లో చిరుత పులి పాద ముద్రల కొలతలు తీస్తున్న అటవీ శాఖ అధికారులు

ప్రకృతి రమణీయంగా.. కొండలరాయుడి కోట..




కొండలరాయుడి కోట



రాతి కట్టడాలలో కొలను

● కొండగట్టులో భక్తులను ఆకట్టుకుంటున్న రాతి కొండ

మల్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానానికి వెనకాల వాయువ్యం వైపున ఎత్తయిన గుట్టలు, పచ్చని చెట్లు, చుట్టూ ప్రకృతి రమణీయత మధ్య గల కొండలరాయుడి రాతి కోట చారిత్రాత్మకమైంది. వందల ఏళ్ల చరిత్ర గల ఈ రాతి కోటను మల్యాల మండలం మానాలకు చెందిన బల్మూరి కొండలరాయుడు నిర్మించాడని చరిత్రకారులు చెబుతారు. వివాహమైన చాలా కాలం తర్వాత దంపతులకు అంజన్న పుణ్యఫలంగా బల్మూరి కొండలరాయుడు జన్మించాడని స్థానికులు పేర్కొంటారు. బల్మూరి కొండలరాయుడు ఆలయం వెనకాల రాతి కోటతో పాటు నీటి కొలను నిర్మించినట్లు స్థానికులు చెబుతారు. రాతి కొండను సందర్శించే భక్తులకు బండ రాళ్లపై గుర్రపు స్వారీ చేసిన గుర్రపు అడుగుల డెక్కలు, బురుజు, కోటగోడలు, కొలను చూడవచ్చు. అంజన్న దర్శనానికి వచ్చే భక్తులు కొండలరాయుడి కొండకు వెళ్లి అక్కడి నుంచి ప్రకృతి సుందర దృశ్యాలను తిలకిస్తుంటారు. ఎత్తైన ప్రాంతంలో గల కొండలరాయుడి కోటను సందర్శించే భక్తులు అక్కడి నుంచి పచ్చని గుట్టలు, చెట్ల మధ్య గల కరీంనగర్-జగిత్యాల రహదారి, రైల్వే మార్గం, వరదకాలువ దృశ్యాలను చూస్తూ ఫొటోలు దిగుతుంటారు. కొండలరాయుడి కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే చాలా మంది ప్రకృతి ప్రేమికులు వచ్చే అవకాశం ఉంది.



బండపై గుర్రపు డెక్కల గుర్తులు

ఖోఖో క్రీడాకారులు.. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

● ఉమ్మడి జిల్లాలో ఖోఖో క్రీడాభివృద్ధికి కృషి
● జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరందర్‌రెడ్డి
● ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీలు



ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఖో-ఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని, అందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తామని కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ ఖో-ఖో పోటీల ముగింపు సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోఉన్న క్రీడాకారుల ప్రతిభకు కొదవలేదని, కావాల్సింది ప్రోత్సాహమేనని అన్నారు. నిత్య శిక్షణ, క్రమశిక్షణతో రాణిస్తే భవిష్యత్‌లో ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగే అవకాశముందన్నారు. జిల్లా ఖో-ఖో క్రీడారంగానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఖో-ఖో అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలను అందజేస్తానన్నారు. జిల్లాలో రాష్ట్ర, జాతీయ స్థాయి ఖో-ఖో క్రీడలను నిర్వహించేందుకు కృషిచేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులు క్రీడలతోపాటు చదువులోనూ రాణించాలన్నారు. వివిధ సంస్థల్లో ఉద్యోగులుగా చేరేందుకు క్రీడాకారులకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు.

జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి తెలంగాణ ఖో-ఖోఅసోసియేషన్ ఉపాధ్యక్షుడు వై.మహేందర్‌రావు మాట్లాడుతూ ఉమ్మడిజిల్లా నుంచి 130మంది క్రీడాకారులు, 20 మంది టెక్నికల్ అఫీషియల్స్, 30మంది సీనియర్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. అంతకుముందు సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరందర్ రెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో భారత మహిళల ఖో-ఖో జట్టు కోచ్ నరేష్, కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పోలీసు సీఐ కుమారస్వామి, వివిధ జిల్లాల ఖో-ఖో సంఘాల ప్రధానకార్యదర్శులు డాక్టర్ వేల్పుల కుమారస్వామి, లక్ష్మయ్య, డాక్టర్ రవీందర్, ఎస్‌కే మోయినుద్దీన్, సూర్యప్రకాశ్, జిల్లా పెటాఅధ్యక్ష, కార్యద ర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, పెద్దపల్లి పెటా అధ్యక్షుడు డాక్టర్ వేల్పుల సురేందర్, అంతర్జాతీయ ఖో-ఖో క్రీడాకారులు గెల్లు మధుకర్, వెంకటేష్, రాజు, డాక్టర్ నవీన్, జిల్లా ఖో-ఖో సంఘంప్రతినిధులు కట్ట సంతోష్, శేఖర్, శివకుమార్, రాజబాబు, మధుసూదన్, శ్రీలత, జ్యోతి, సంధ్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు పెరిగిన వరద

● ప్రాజెక్టులోకి 28,147 క్యూసెక్కుల నీరు రాక



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు రావడం ఆదివారం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు బాబ్లీ గేట్లు ఎత్తివేయడం, విష్ణుపురి, అంబూరా, బాలేగావ్ తదితర ప్రాజెక్టులు నిండడంతో ఎస్సారెస్పీలోకి 28,147 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 41.907 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగునీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 8,773 క్యూసెక్కుల నీటిని వదులు తున్నారు. కాకతీయ కాలువకు 3,500క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150క్యూసెక్కులు, వరద కాలువకు 3వేల క్యూసెక్కులు, అలీ సాగర్ ఎత్తిపోతల పథకానికి 360క్యూసెక్కుల, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 462 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 34.658 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 5.748 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయం

● స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం ● కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. శ్రావణమాసం ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ముందుగా ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించిన భక్తులు రాజన్నకు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోడెమొక్కు చెల్లించేందుకు భక్తులు సుమారుగా మూడు గంటలపాటుగా బారులు తీరారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని పార్వతి రాజరాజేశ్వర స్వామి వారలను దర్శించుకుని తరించారు. రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గండ దీపంలో నూనేపోసి గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తెలెత్తకుండా ఆలయ ఈవో రాధాబాయి చర్యలు తీసుకున్నారు.



భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయ ప్రాంగణం



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

ఆకట్టుకున్న అనువంశిక అర్చక కుటుంబాల భజన..

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన నాంపల్లి లక్ష్మీనృసింహస్వామి వారి ఆలయంలో గోపన్నగారి మాధవి ఆధ్వర్యంలో అనువంశిక అర్చక కుటుంబాల మహిళలు చేపట్టిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది.

శ్రావణ మాసం సందర్భంగా అర్చక కుటుంబాల మహిళలు నాంపల్లి లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి తరలివెళ్లారు. స్వామివారిని దర్శించుకుని భజన చేశారు.

మనువాదంతో నరమేధం సృష్టిస్తున్నారు

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

ఓదెల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మత్మోనాదం, మనువాదం, నియంతృత్వంతో అడవుల్లో నరమేధం సృష్టిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని కనగర్తి గ్రామంలో ఆదివారం స్వర్గీయ ఇట్యాల వెంకటయ్య ప్రాంగణంలో ఆరుట్ల రామచంద్రారెడ్డి భవన్ వద్ద ఆదివారం సీనాయర్ నాయకుడు ఆది రామారావు అధ్యక్షతన సీపీఐ మండల పదవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ చెప్పినట్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యం, కూడు, గుడ్డ నీడ ప్రజలకు అందించడం లేదని తెలిపారు. నీరవ్ మోడీ, విజయ్‌మాల్యా లాంటి ఆర్థిక నేరస్తులు వేలాదికోట్లు ఎత్తుకెళ్లి విదేశాల్లో ఉంటున్నారని అన్నారు. అలాంటివారిని దేశానికి రప్పించకుండా కర్రిగుట్టలు, దండకారణ్యంలో క్రూరమైన చర్యలకు పాల్పడుతూ ఆదివాసీలు, మావోయిస్టులను చంపివేస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టులు శాంతిచర్చలకు ముందుకు వచ్చినా కూడా ప్రధాని, అమిత్‌షా మొండిగా వ్యవహరించి అడవుల్లో వందలాది మందిని ఎదురు కాల్పుల పేరుతో కాల్చివేశారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, చట్టాలను ఉల్లంఘించి చంపేహక్కు వీరికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. బీసీలకు ఉపయోగపడే రిజర్వేషన్ బిల్లును ప్రధాని, గవర్నర్ అడ్డుకోవడం శోచనీయమన్నారు. జిల్లాలో ఇందిరమ్మ కమిటీల పేరుతో పేదలకు అన్యాయం జరిగిందని, రాష్ట్రంలో బ్రాందీషాపుల ద్వారా రూ.25వేలకోట్ల నుంచి రూ.30వేలకోట్ల ఆదాయం ప్రభుత్వానికి వస్తుందని, ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టులు పోటీలో ఉండాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కలవేని శంకర్, జిల్లాకార్యదర్శి తాండ్ర సదా నందం, డిహెచ్‌పీఎస్ రాష్ట్రనాయకుడు తాళ్లపల్లి లక్ష్మణ్ సమావేశంలో మాట్లాడారు. అనంతరం మండలంలో మూడేళ్లపాటు కార్యక్రమాల నివేదికను కోడం స్వామి చదివి వినిపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య, కరీంనగర్ టౌన్ కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి కోడం స్వామి, ఆళ్ల చిన్న శ్రీనివాస్‌రెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాడ వెంకట్ రెడ్డి

అలుగుపారుతున్న సింగరాయకుంట

● నిండుకుండులా పత్తికుంట చెరువు



మత్తడి దూకుతున్న సింగరాయకుంట

ఇల్లంతకుంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సింగరాయకుంట, పత్తికుంట చెరువులు నిండుకుండలా కనిపిస్తున్నాయి. రహీంఖాన్‌పేట గ్రామసమీపంలోని సింగరాయకుంట నిండటం వల్ల రహీంఖాన్‌పేట, నారెడ్డిపల్లె, పండలాపురం, కందికట్కూర్ గ్రామాల సమీపం నుంచి మధ్యమానేరులోకి నీరు వెళ్తోంది. దీనితో ఈ ప్రాంతాల రైతుల బావుల్లో భూగర్భజలాలు పెరుగనున్నాయి. పత్తికుంటపల్లె గ్రామసమీపంలోని పత్తికుంట చెరువులోకి భారీగా నీరుచేరడంతో మత్తడి దూకుతోంది. చెరువులు నిండటం వల్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎగువ మానేరుకు పెరుగుతున్న వరద

● 25 ఫీట్లకు చేరిన నీటి మట్టం

గంభీరావుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయం నీటిమట్టం రోజురోజుకు పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగు పొంగిపొర్లుతోంది. దీంతో వరదనీరు మానేరు జలాశయంలోకి భారీగా వస్తోంది. మొత్తం 31 ఫీట్ల సామర్థ్యం గల మానేరు నీటి మట్టం ప్రస్తుతం 25 ఫీట్లకు చేరింది. మానేరు మత్తడి దూకేందుకు మరో 6 ఫీట్ల నీరు అవసరం ఉండటంతో ఈ ప్రాంత రైతుల్లో అనందం వ్యక్తం అవుతోంది.



నిండు కుండలా ఎగువ మానేరు జలాశయం

అపరిశుభ్రంగా గోదావరి తీరం

● శివుడి విగ్రహం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పవిత్ర గోదావరినది వద్ద ఏర్పాటు చేసిన శివుని విగ్రహం చుట్టూ చెత్త పేరుకుపోయి అపరిశుభ్రంగా మారినా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శ్రావణమాసం సందర్భంగా గోదావరి నదికి వందలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి వస్తున్నారు. గోదావరి వద్ద శివుని విగ్రహాన్ని పట్టించుకోకపోవడంతో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శివుడి విగ్రహం కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించి విగ్రహానికి రంగులు వేయిం చారు. కానీ విగ్రహం చుట్టూ పాలిథిన్ కవర్లు, దేవుని ఫొటోలతో పేరుకు పోయినా కార్పొరేషన్ అధికారులు తొలగించడం లేదు. భక్తులు గోదావరిలో పుణ్యస్నానం చేసేందుకు ఏర్పాటు చేసిన మెట్లు కూడా చెత్తపేరుకు పోయింది. కార్పొరేషన్ అధికారులు వంద రోజుల కార్యాచరణ కార్యక్రమాలు అంటూ తూతూమంత్రంగా పనులు నిర్వహించి వెళ్లిపోతున్నారు. అపరిశు భ్రంగా మారిన గోదావరినది స్నానఘట్టాలను, శివుని విగ్రహం చుట్టూ ఉన్న వ్యర్థాలను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.



శివుడి విగ్రహం చుట్టూ ఉన్న చెత్తాచెదారం, చిత్రపటాలు



గోదావరి ఒడ్డున ఉన్న చెత్తాచెదారం, చిత్రపటాలు

మల్లారపు శంకర్‌కు జాతీయ అవార్డు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలం భోజన్నపేట గ్రామానికి చెందిన హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లారపు శంకర్‌ను బహుజనసాహిత్యఅకాడమీ వారు మహత్మ జ్యోతిబా పూలే జాతీయ అవార్డు 2025క ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆదివారం మల్లారపు శంకర్‌కు సాహిత్య అకాడమీ జాతీయఅధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అభినందించారు. జాతీయ అవార్డు రావడం పట్ల పలువురు శుభాకాంక్షలు తెలిపారు. సెప్టెంబర్ 5న తిరుపతిలో జరిగే బహుజన సాహిత్య అకాడమీ 18వ జాతీయ కాన్ఫరెన్స్‌లో అవార్డు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.



మల్లారపు శంకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

‘మహాలక్ష్మి’తో ఆర్టీసీకి కాసుల పంట

● మహిళలకు ఉచిత ప్రయాణంతో సంస్థకు ఆదరణ ● రీజియన్ వ్యాప్తంగా రూ.721.35 కోట్ల ఆదాయం



భగత్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో కాసుల పంటపండింది. పథకంతో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించడం, మహిళలు పెద్దమొత్తంలో ఆర్టీసీబస్సుల్లో ప్రయాణిస్తుండడంతో సంస్థకు కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2023 సంవత్సరం డిసెంబరు 9వ తేదీన మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆనాటి నుంచి నేటి వరకు మహాలక్ష్మి పథకం కింద మహిళలు పెద్దసంఖ్యలో ఆర్టీసీ ఆదరిస్తున్నారు. దీంతో సంస్థకు పెద్ద ఎత్తున లాభాలు సమకూరుతున్నాయి. కరీంనగర్ రీజియన్‌వ్యాప్తంగా కరీంనగర్-1, కరీంనగర్-2, మంథని, హుజూరాబాద్, హుస్నాబాద్, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ, గోదావరిఖనితో కలుపుకొని 11డిపోలు ఉన్నాయి. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా కరీంనగర్‌జిల్లాలో ఆర్టీసీ 244బస్సులను నడిపించి 4.83కోట్లమంది ప్రయాణికుల ద్వారా రూ. 201.82 కోట్ల రూపాయలను ఆర్జించింది. జగిత్యాలజిల్లాలో 194 బస్సులను నడిపించి 5.38 కోట్ల మంది ప్రయాణికులతో 208.62కోట్లరూపాయలు, పెద్దపల్లిజిల్లాలో 136బస్సులతో 3.59కోట్లమంది ప్రయాణికులతో 154.08కోట్ల రూపాయలు, సిరిసిల్లజిల్లాలో 111బస్సులతో 2.87కోట్లమంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి 113.73కోట్ల రూపాయలు, సిద్దిపేట జిల్లాలో హుస్నాబాద్ డిపోలో 60 బస్సులను నడిపించి 1.26 కోట్ల మంది మహాలక్ష్మి ప్రయాణికులతో 43.11కోట్లరూపాయల ఆదాయాన్ని సంపాదించింది. మొత్తానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల్లో 745 బస్సులను నడిపించి 17.93 కోట్ల మహాలక్ష్మి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి 721.35 కోట్ల రూపాయల ఆదాయాన్ని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అర్జించింది.

కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా వివిధ డిపోల్లో వచ్చిన ఆదాయం

డిపో	బస్సులు	ప్రయాణికులు	ఆదాయం
హుజూరాబాద్	64	1.37	56.07
కరీంనగర్-1	87	1.71	60.89
కరీంనగర్-2	93	1.75	84.86
జగిత్యాల	95	2.40	93.07
కోరుట్ల	51	1.52	56.66
మెట్‌పల్లి	48	1.46	58.88
గోదావరిఖని	90	2.70	105.90
మంథని	46	0.89	48.18
సిరిసిల్ల	59	1.33	56.46
వేములవాడ	52	1.54	57.27
హుస్నాబాద్	60	1.26	43.11
రీజియన్ వ్యాప్తంగా	745	17.93	721.35

హుజూరాబాద్‌లో కోతుల బెడద




హుజూరాబాద్ హైస్కూల్ గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్‌పై కోతులు

హుజూరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో రోజురోజుకు కోతుల బెడద ఎక్కువవుతోంది. ఆదివారం పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో వాకర్స్ వాకింగ్ చేస్తుండగా దాడికి యత్నించాయి. గతంలో హుజూరాబాద్‌లో కోతులదాడిలో తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి మృతిచెందారు. కోతులు దాడులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

విజృంభిస్తున్న దోమలు

- జమ్మికుంటలో తీవ్రమైన బెడద
- కానరాని నివారణ చర్యలు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలంలో దోమలు విజృంభిస్తున్నాయి. ఇటీవల దోమల బాధ మరింత పెరుగడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి అయితే చాలు దోమలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రతతోనే కాకుండా, మురికి కాల్వల్లో మందు పిచికారి చేయడం, మురికి నీటిని నివారించడం, చెత్త, ఎత్తడం, చివరి దశగా ఫాగింగ్ చేయడం చేస్తుంటారు. దోమల



నివారణకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించక పోవడంతో దోమల బెడద తీవ్రతరమైంది.

● తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మురికి నీరు నిలువకుండా చూడాలి.
- మురికి కాల్వలపై పైకప్పులు వేయాలి.
- నివాసాల మధ్య పిచ్చి మొక్కలు తొలగించాలి.
- వరద కాల్వల్లో మురికి నీరు, వరద నీరు కూడ నిలవకుండా చూడాలి.
- నిరంతంర ఫాగింగ్ నిర్వహించాలి.
- చేతి పంపులు, కుళాయిల వద్ద నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలి.
- కాలనీల్లో చెత్త కుప్పలు ఎప్పటికి అప్పుడు ఎత్తి వేయాలి.

నిమిషాల్లో నేర చరిత్ర వెల్లడి

(5వ పేజీ తరువాయి)

పరిజ్ఞానం పాపిలన్. ఈ పాపిలన్ పరిజ్ఞానం రష్యా నుంచి రాష్ట్ర పోలీసు శాఖ కొనుగోలు చేసింది. దీంతోపాటు లైవ్ స్కానర్ పరిజ్ఞానాన్ని కూడా కొనుగోలు చేశారు. లక్షలాది వేలిముద్రలను క్షణాల్లో విశ్లేషించి డేటా బేస్‌లో ఉన్న పాత నేరస్తుల వేలి ముద్రలతో పోల్చుతుంది. లైవ్ స్కానర్‌పై అనుమానితుల రెండు అరచేతులను ఉంచిన సమయంలో వారు గతంలో నేరస్థులై ఉంటే క్షణాల్లో వారి ఫోటోలతోసహా పూర్తి డాటా తెలిసిపోతుంది. ఈ రెండు రకాల సాంకేతిక పరిజ్ఞానం పోలీసులకు కేసుల దర్యాప్తులో కీలకంగా మారింది.

● గస్తీ సమయంలో వినియోగం

జిల్లాలో దోపిడీలు, దొంగతనాలు, ఇతర తీవ్రనేరాలకు ప్పాడిన నేరస్థులకు సంబంధించి దాదాపు 20 వేల మంది నేరస్థుల వేలి ముద్రలు పోలీసులు సేకరించి హైదరాబాద్‌లోని ప్రధాన సర్వర్‌కు అనుసంధానం చేశారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల పోలీసుల వద్ద ఉన్న డాటాను సర్వర్‌కు అనుసంధానం చేయటంతో రాష్ట్రంలోని ఎక్కడి నేరస్థుడికి సంబంధించిన డాటా అయినా క్షణాల్లో ఇక్కడి పోలీసులకు ఇట్టే తెలిసిపోతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ డేటా బేస్‌లో 10 లక్షలపైగా నేరస్థుల డాటా నిక్షిప్తమై ఉన్నది. పాపిలన్ పరిజ్ఞానంతో కూడిన ఫింగర్ ప్రింట్(ఎఫ్‌పీ)డివైజ్ పోలీసు కమిషనరేట్‌లోని ప్రతి పోలీసు స్టేషన్‌కు అందజేశారు. ఆయా ఠాణాల పరిధిలో గస్తీ సమయం, సమావేశాలు, ఇతర సమయాల్లో ఈ డివైస్‌తో పోలీసులు అక్కడ అనుమానితుల వేలిముద్రలు సేకరించి పాత నేరస్థులైతే మరో నేరం జరుగకుండా వెంటనే చర్యలు తీసుకుంటున్నారు.

● న్యూస్‌బాక్స్

భవన నిర్మాణం విరాళం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీసరస్వతీ విద్యా పీఠం ద్వారా నిర్వహిస్తున్న సరస్వతీ శిశుమందిర్ పాఠశాల ఇంటర్నేషనల్ స్కూల్‌గా మార్పు చేస్తున్న క్రమంలో ఆదివారం భవన నిర్మాణం కోసం కొమురవెల్లి లక్ష్మీకాంతం పేరిట కుమారుడు కొమురవెల్లి మహేశ్ (1997-98 బ్యాచ్ పూర్వ విద్యార్థి) లక్ష రూపాయల విరాళం అందజేశారు. కోల అన్నారెడ్డి, దేవేందర్‌రావు, రాజమౌళి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

భగత్‌నగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కృతియూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రేకుర్తిలోని శ్రీశివసాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదివారం పండ్లు, బ్రెడ్ పంపిణీ చచేశారు. కృషి యూత్ అసోసియేషన్ ప్రతినిధులు బండారి చంద్రయ్య, దుర్గం లింగమూర్తి, దుర్గం శేఖర్ పాల్గొన్నారు.

చట్టసభల్లో సరైన స్థానం కల్పించాలి

చొప్పదండి, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): బీసీలకు జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో సరైన స్థానం కల్పించాలని బీసీ నాయకులు కోరారు. చొప్పదండిలోని గీర్వాణి కళాశాలలో ఓబీసీ పోరుబాట పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలు కలిసి మెలసి ఉండి రాజ్యాధికారం సాధించాలన్నారు. ఓబీసీల ఐక్యత కోసమే సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి ఓబీసీ పోరుబాట అనే పుస్తకాన్ని రాశారని అన్నారు. కార్యక్రమంలో మాజీఎంపీపీలు చిలుక రవీందర్, వాసల రమేష్, తొటు మురళీ, మాజీ జడ్పీటీసీ సాంబయ్య, నాయకులుపాల్గొన్నారు.



బ్యాంకు డిపాజిట్ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

విద్యతోనే ఉన్నత శిఖరాలు : ఎమ్మెల్యే

మానకొండూర్/తిమ్మాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిట్‌లో జాతీయస్థాయిలో 17వ ర్యాంకు సాధించిన మండలంలోని గంగిపల్లికి చెందిన మార మహేశ్ అనే విద్యార్థికి రూ.5.22 లక్షలను డిపాజిట్ చేసిన సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. నిట్‌లో జాతీయ స్థాయిలో 17వ ర్యాంకు సాధించిన మార మహేశ్ ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కవ్వంపల్లి అనురాధ సొంతంగా రూ.1.50లక్షలతో పాటు 1987మెడిసిన్ బ్యాచ్‌తో కలిసి సేకరించిన మొత్తం రూ.5.22లక్షలను అందజేయడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సతీమణి కవ్వంపల్లి అనురాధ, కాంగ్రెస్ నాయకుడు ఉట్కూరి నరేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యావిధానంలో మార్పులకు అనుగుణంగా బోధించాలి

భగత్‌నగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): విద్యావిధానంలో మార్పులకనుగుణంగా బోధించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ (సీబీఎస్‌ఈ)లో ఏర్పాటు చేసిన జాతీయ విద్యావిధానం సదస్సులో మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సమాజంలో మార్పులకు అనుగుణంగా విద్యావిధానంలో మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉంద న్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు విద్యావిధానంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యావిధానాన్ని సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం ఎంతగానో దోహద పడుతుందన్నారు. విద్యార్థులకు అనువైన పద్ధతుల్లో బోధన అందించాల్సిన అవసరం ఎంతగానో



మాట్లాడుతున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్‌ఎన్‌ఎస్ శ్రీనివాస్, సంజీవ్‌కుమార్, నాంపల్లి సంజీవ్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కవులకు భూమిక 'భవానీ సాహిత్య వేదిక'

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కొత్త కవులను సాహిత్య రంగానికి పరిచయం చేస్తున్న వైరాగ్యం ప్రభాకర్ ఆధ్వర్యంలో నడుస్తున్న భవానీ సాహిత్య వేదిక కవులకు ఓ భూమిక అని ధర్మకేతనం కళా పీఠం అధ్యక్షుడు, విశ్రాంత అటవీ అధికారి ఎన్‌వీ రఘువీర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ ప్రగతినగర్ సుందరయ్య భవన్‌లో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన చ'నా తెలంగాణ', 'అమ్మకు అమ్మనై' అనే రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం కవులను సన్మానించారు.

రైతు బీమా నమోదు చేసుకోవాలి

భగత్‌నగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రైతు బీమా పథకానికి ఈ నెల 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కొత్తపల్లి మండల వ్యవసాయాధికారి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5వ తేదీ వరకు పాస్ బుక్ వచ్చిన రైతులు, ఇంత వరకు రైతు బీమా నమోదు చేసుకోని రైతులు నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు, పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను వ్యవసాయ విస్తర్ణ అధికారికి అందించాలని తెలిపారు. పుట్టిన తేదీని ఆధార్ కార్డు ఆధారంగా లెక్కిస్తారని, ఆధార్ కార్డు ప్రకారం 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయస్సు గల రైతులు రైతు బీమాకు అర్హులని తెలిపారు.

గంగాధర/హుజూరాబాద్/శంకరపట్నం/గన్నేరువరం: ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమాను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏలు ప్రియదర్శిని, సునీత, వెంకటేష్, కిరణ్మయి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆయాగ్రామాల ఏఈవోలు రైతు బీమా నమోదు చేస్తారని, 14 ఆగస్టు 1966 నుంచి 14 ఆగస్టు 2007 మధ్యలో జన్మించిన రైతులు తమపట్టదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డుల జిరాక్స్‌తో ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. సమయం తక్కువగా ఉన్నందున గడువు ముగియక ముందే రైతు బీమాకి రైతులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

రేణికుంటలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తిమ్మాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-2002 సంవత్సరం పదోతరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పూర్వవిద్యార్థులు ఒక్కచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రోజంతా ఉల్లాసంగా గడిపారు. చాలా మంది ఉన్నత స్థాయిలలో ఉండడంతో గురువులు సంతోషం వ్యక్తం చేశారు.

గాలి గోపురం పనులు ప్రారంభం

శంకరపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ గాలి గోపురం నిర్మాణ పనులు ఆదివారం పాలకవర్గ కమిటీ సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో మత్స్య గిరీంద్రస్వామి ఆలయ చైర్మన్ కోరెం రాజిరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ మలహల్‌రావు, అర్చకులు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల దిక్సూచి శివశంకర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాల దిక్సూచి దివంగత కేంద్ర మాజీ మంత్రి పుంజాల శివశంకర్ అని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ అన్నారు. ఆదివారం ముకాస విద్యార్థి వసతి గృహంలో నిర్వహించిన శివశంకర్ 96వ జయంతి సందర్భంగా వాళులర్పించారు. అనంతరం హరిశంకర్ మాట్లాడుతూ శివశంకర్ పట్టుదల, అవిరళ కృషి, కార్యదీక్ష వల్లే ఉమ్మడి రాష్ట్రంలో ఆ తర్వాత జాతీయ స్థాయిలో బీసీలకు విద్యా ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయన్నారు. బీసీలకు, స్థానిక సంస్థల ఎన్నిల్లో, విద్యా ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలన్నారు. టాంక్‌బండ్‌తోపాటు అన్ని జిల్లాల్లో శివశంకర్ కాంస్య విగ్రహాలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర యువజన కార్యదర్శిగా ఎన్నికైన సత్తినేని శ్రీనివాస్‌ను సన్మానించారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బొమ్మ రాధాకృష్ణ, నలువాల రవీందర్, కనకం అమర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానం వస్తే పరీక్షలే..

- ● పోలీస్ స్టేషన్‌లలో డ్రగ్స్ టెస్ట్ కిట్స్
- ● డ్రగ్స్‌పై ఉక్కుపాదం

సైదాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు గంజాయి, డ్రగ్స్ తీసుకున్నప్పుడు దొరికితేనే పోలీసులు వారిపై చర్యలు తీసుకునే వారు. కానీ ఇప్పుడు అలా కాదు.. డ్రగ్స్ కిట్లు వచ్చేశాయి. అనుమానం వస్తే చాలు పోలీసులు అక్కడికక్కడే వారికి డ్రగ్స్ కిట్ ద్వారా పరీక్షలు నిర్వహించి, నిర్ధారణ చేయనున్నారు. ఆ పరీక్షలో పాజిటీవ్ వస్తే వారిపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకోనున్నారు. గ్రామాల్లో యువత గంజాయి సేవించి తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, వారిని ఆ మహమ్మారి నుంచి రక్షించేందుకు పోలీస్ శాఖ ఈ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే డ్రగ్స్ పరీక్ష కిట్‌లు ఆయా పోలీస్ స్టేషన్లకు చేరాయి. ఇక నుంచి పోలీసులు డ్రగ్స్ బాధితుల వేట మొదలు పెట్టనున్నారు. డ్రగ్స్ తీసుకున్న వారికి చుక్కలు చూపించనున్నారు.

● నిమిషాలలో నిర్ధారణ..

డ్రగ్స్ కిట్‌ల ద్వారా నిమిషాలలో డ్రగ్స్ తీసుకున్నది లేనిది నిర్ధారణ జరుగనుంది. అనుమానితులను గుర్తించి డ్రగ్స్ కిట్ డబ్బాలో వారి మూత్రము ఉంచినట్లయితే వెంటనే ఏ డ్రగ్స్ తీసుకున్నాడో లేదో చూపిస్తుంది. పాజిటివ్ నిర్ధారణ అయిన వ్యక్తులపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశముంది.

● ఏ డ్రగ్స్ వాడినా తెలుస్తుంది..

ఈ డ్రగ్స్ కిట్టు ద్వారా పరీక్ష చేస్తే గంజాయితో పాటు ఇతర ఏ మత్తు పదార్థం వాడినా ఇట్టే తెలిసిపోతుందని పోలీసులు తెలుపుతున్నారు. అన్నిరకాల డ్రగ్స్‌ను గుర్తించే విధంగా ఈ కిట్టును తయారు చేసినట్లు వారు తెలిపారు. ఇక నుంచి డ్రగ్స్ కిట్లు పోలీస్ సిబ్బంది వద్ద అన్ని వేళలో అందుబాటులో ఉండనున్నాయి. ఎక్కడ, ఎవరిపై అనుమానం వచ్చినా డ్రగ్స్ పరీక్షలు నిర్వహించనున్నారు.

సంక్షిప్తంగా...

చొప్పదండి: మండలంలోని మంగళపల్లికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గడ్డం మోహన్‌రెడ్డి(70) అనారోగ్యానికి గురై ఆదివారం మరణించగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

గంగాధర: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పురుమల్ల మనోహర్ అన్నారు. ఆదివారం పల్లె పల్లెకు కాంగ్రెస్‌లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.

గంగాధర: మండలంలోని గర్శకుర్తిలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. ఆదివారం గర్శకుర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సరస్వతీ విద్యాలయంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కరీంనగర్ కెల్విన్ వైద్యబృందం ఆధ్వర్యంలో ఉచితబీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లికి చెందిన మండల సుదర్శన్ ఇటీవల మృతిచెందగా, చేనేత సహకార సంఘం పర్సనల్ ఇన్‌చార్జి ఉపేందర్, మేనేజర్ వైకుంఠం, అసిస్టెంట్ మేనేజర్ కోటిలింగం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి భార్య లలితకు రూ.8వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

వీణవంక: మండలంలోని వల్బాపూర్‌కు చెందిన వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ మారముళ్ల కొంరయ్య తండ్రి చంద్రయ్య ఇటీవల మృతిచెందగా కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకుడు, కేడీసీసీ బ్యాంక్ జిల్లా వైస్‌చైర్మన్ పింగిలి రమేష్ ఆదివారం పరామర్శించారు.

ఘనంగా మాజీ సర్పంచ్ విజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకల్లో మాజీ సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి

గంగాధర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్, సమాజ సేవకుడు కంకణాల విజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల యూత్ ఆధ్వర్యంలో కొండగట్టు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆలయ సమీపంలోని వానరాలకు అరటిపండ్లను అందించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండగట్టు, గంగాధరలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం యూత్ సభ్యులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పెద్దపీట వేసి రాష్ట్రంలోనే గుర్తింపు తీసుకువచ్చిన మాజీసర్పంచ్ విజేందర్‌రెడ్డి స్ఫూర్తిగా నిలిచారని, భవిష్యత్‌లో మరిని పదవులు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మండల యువత పాల్గొన్నారు.

డ్రగ్స్ పరీక్షలో పాజిటివ్ వస్తే చర్యలు

సైదాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా డ్రగ్స్, గంజాయి తీసుకున్నట్లు అనుమానం వస్తే డ్రగ్స్ పరీక్షలు నిర్వహిస్తామని, పాజిటివ్ వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సైదాపూర్ ఎస్సై సీహెచ్ తిరుపతి హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలకేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు యువకులు నిర్మానుష్య ప్రాంతంలో అనుమానితంగా కనిపించడంతో వారికి డ్రగ్స్ పరీక్ష నిర్వహించామన్నారు. ఫలితం నెగెటివ్ రావడంతో వదిలిపెట్టామన్నారు.

సాగు నీరందించి రైతులను ఆదుకోవాలి

సైదాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎండీ నుంచి కాకతీయ కెనాల్ ద్వారా పంట పొలాలకు సాగు నీరు అందించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి అన్నారు. ఆదివారం సీపీఎం మండల కార్యదర్శి గుండేటి వాసుదేవ్‌తో కలిసి మండలంలోని వెన్నంపల్లి, సోమారం శివారులో కాకతీయ కాలువను పరిశీలించారు. కాలువ నీరుపై ఆధార పడి చాలామంది రైతులు భూములు సాగు చేసుకుంటున్నారని, కానీ ఇప్పటివరకు కాలువలో చుక్కనీరు లేకపోవడం బాధాకరమని అన్నారు. కెనాల్ నీటిపై ఆధారపడి నాట్లు వేసిన రైతుల పొలాలు ఎండిపోయే అవకాశ ముందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కాకాతీయ కెనాల్ ద్వారా సాగునీరు విడుదల చేయాలని కోరారు.

ఆటో యూనియన్ ఎన్నికలు

గంగాధర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురిక్యాల ఆటో యూనియన్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా దోమకొండ శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా నేరెళ్ల శ్రీనివాస్, ఉపాధ్య క్షుడిగా మల్లయ్య, క్యాషియర్‌గా కనుకయ్య, సహాయ కార్యదర్శిగా కొమురయ్య ఎన్నుకున్నారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తొలగించలగరా?

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదానికి ముస్లింలను తొలగించాలంటున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బీజేపీ పాలిత రాష్ట్రాలలో తొలగించాలని ప్రధాని మోదీని డిమాండ్ చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం అన్నారు. డీసీసీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌తో పాటు ఉత్తరప్రదేశ్, ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర కార్యాలయం మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వమే ఉందని, అక్కడ బీసీ రిజర్వేషన్లలో ఉన్నటువంటి ముస్లింల రిజర్వేషన్లను



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం

తీసేయాలని బండి సంజయ్ డిమాండ్ చేయగలరా? అని ప్రశ్నించారు. ఏపీలో బీజేపీ మిత్రపక్షమైన టీడీపీ నేత, సీఎం నారాచంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను అక్కడ బీసీ రిజర్వేషన్లలో ముస్లింలను తొలగిస్తేనే కొన సాగుతామని సంజయ్ డిమాండ్ చేయాలన్నారు.

ప్రజా సమస్యలను ప్రభుత్వానికి విన్నవించకుండా హైదరాబాద్‌లో ధర్నా చౌక్‌ను ఎత్తివేసిన చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీది అని, ఉనికి కోసం అదే ధర్నా చౌక్‌లో బీఆర్‌ఎస్ ధర్నా చేపడుతోందని విమర్శించారు. బీఆర్‌ఎస్ నేత, ఎమ్మెల్సీ కవితకు బీసీలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌తో కలిసి ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్,ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా సోమవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్, టు, ఏడీఈలు శ్రీనివాస్‌గౌడ్, లావణ్య తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సంతోష్‌నగర్, బాలజీ సూపర్ మర్కెట్, సాయిబాబా టెంపుల్, శక్తి టెంపుల్, ఉదయం 8 గంటల నుంచి 10 వరకు షాషామహల్, లక్ష్మీనగర్, కోతిరాంపుర్ ఏరియా, పోచమ్మకాలనీ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

తెలంగాణ బీసీలకు బీజేపీ అన్యాయం

హుజూరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బీసీ ప్రధానమంత్రి అంటూ ప్రచారం చేస్తున్నప్పటికీ తెలంగాణ బీసీలకు అన్యాయం చేస్తోందని సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో బీసీలకు42శాతం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టంచేసి 9వ షెడ్యూల్లో చేర్చా లని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ తీర్మాణం చేసి 42శాతం బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వానికి ఆమోదం కోసం పంపిందన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేయకుండా రిజర్వేషన్లకు మతం రంగు పులుముతున్నదని విమర్శించారు. రాష్ట్రంలో 8మంది ఎంపీలు ఉండి రాష్ట్రానికి ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ తొండి మాటలు మాట్లాడుతూ బీసీలను మోసం చేస్తున్నారన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించే వరకు సీపీఎం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దాట్ల రత్నాకర్, మాట్ల కొంరయ్య, ఉమా సరోజన, ప్రేమ్‌కుమార్, సుధాకర్, లక్ష్మీనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

20న మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళం

జమ్మికుంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దుబ్బ మల్లిఖార్జునస్వామి ఆలయ ఆవరణలో ఈనెల 20న నిర్వహించనున్న మున్నూరు కాపు ఆత్మీయసమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మున్నూరు కాపు సంక్షేమసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొనగంటి మల్లయ్య, సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామని, మున్నూరు కాపుకుల బాంధవులు కుటుంబ సమేతంగా వచ్చి జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పొనగంటి సారంగం, పొనగంటి మల్లయ్య, ఆకుల రాజయ్య, కడెం జనార్దన్, కొలగాని రాజు, కాసర్ల రాములు, రవికుమార్, రవీందర్, కొంరయ్య, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కావేటి శ్రీనివాస్‌కు అంతర్జాతీయ పురస్కారాలు

సుభాష్‌నగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యాయవాది డాక్టర్ కావేటి శ్రీనివాస్ మూడు అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాస్ చాలా సంవత్సరాల క్రితం ఆమెరికాకు వెళ్లారు. అక్కడ న్యాయవృత్తిలో కొనసాగుతున్నారు. వృత్తిని నిర్వహిస్తూనే ప్రజలకు న్యాయపరమైన సేవలను అందిస్తున్నారు. మనవ హక్కుల కార్యకర్తగా కొనసాగుతున్నారు. మానవ హక్కులు, న్యాయ సంస్కరణలు, ప్రపంచ న్యాయవాదానికి చేసిన విశేష కృషికి 2025లో ఆయనను మూడు పురస్కారాలతో సన్మానించారు. న్యాయ సమానత్వం, రాజ్యాంగ సంస్కరణలు, అట్టడుగు వర్గాలకు న్యాయం అందించడంలో నాయకత్వానికి గుర్తింపుగా నెల్సన్ మండేలా అవార్డును ప్రకటించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఆక్స్‌ఫర్డ్ మేయర్, కౌన్సిలర్ లుబ్నాఅర్షద్ అవార్డును అందజేశారు. ఎన్‌ఆర్‌ఐ వెల్ఫేర్ సొసైటీ ఆఫ్ ఇండియా ద్వారా ఆయనకు ఇండియన్ ఓవర్సీస్ అవార్డును ప్రదానం చేశారు. ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను, శాంతి, న్యాయం, బలమైన సంస్థల రంగాలలో సాధించడానికి ఆయన చేసిన కృషికి గ్లోబల్ కాన్ఫడరేషన్ ఫర్ ప్రమోషన్ అండ్ డెవలప్‌మెంట్, ఇంక్ నుంచి అవార్డు లభించింది.

ఎంఐఎంను గెలిపిస్తే ఓవైసీ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీని అత్యధిక స్థానాల్లో గెలిపిస్తే పేద విద్యార్థుల కోసం కార్పొరేట్ స్థాయి ఓవైసీ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేస్తామని కరీంనగర్ ఎంఐఎం అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం ముఖరంపురలో 59, 60 డివిజన్ల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఐఎంను ఆదరించాలని, హైదరాబాద్ తరహాలో దారూసలాం బ్యాంకు ఏర్పాటు చేస్తామని, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ బ్రాంచ్‌ను కాకతీయ యూనివర్సిటీకి అనుసంధానం చేస్తామని అన్నారు. అంతకుముందు ముఖరంపుర, కాశ్మీరగడ్డ, మైసమ్మ చెట్టు ప్రాంతాలకు చెందిన యవత, డివిజన్ల వాసులు పార్టీలో చేరారు.డివిజన్ల బాధ్యులు అఖీల్ ఫిరోజ్, ఇబ్రహీం బియాబానితోపాటు అబ్బాస్ షమీ, సయ్యద్ బర్కత్ అలీ, ఖమరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

● పార్టీ కార్యాలయంలో 5 పాత, 3 కొత్త కమిటీల బాధ్యులకు నియామక పత్రాలు అందజేశారు. 31, 34వ డివిజన్ల అధ్యక్షుడిగా మహమ్మద్ తీజొద్దీన్, ఖాజా మజహరొద్దీన్, మరో 6 డివిజన్లకు నియామకాలు చేపట్టినట్లు చెప్పారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నూతన కార్యవర్గం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ఆదివారం ఎన్నుకున్నారు. కరీంనగర్‌లోని సవరన్ స్ట్రీట్ సంఘం భవనంలో ఉమ్మడి జిల్లా డ్రైవర్ల సమక్షంలో మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎండీ వారీస్ నవాబ్, ప్రధాన కార్యదర్శి సంజీవ్ అధ్యక్షతన ఉమ్మడి కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కొందరు వ్యక్తులు సంఘానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, వారికి సంఘం తరఫున క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ 6 సంవత్సరంలు సంఘం నుంచి బహిష్కరించాలని ఈ సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. అంతకుముందు మున్సిపల్ కార్పొరేషన్‌లో డ్రైవర్‌గా పదవీ విరమణ పొందిన గంగిపల్లి నరసయ్యను, రాము డ్రైవర్ నుంచి జూనియర్ సహాయకుడిగా పదోన్నతి పొందగా సన్మానించారు. రాష్ట్ర డ్రైవర్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ హసమ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి సర్దార్ మంజీత్ సింగ్, అసోసియేట్ అధ్యక్షుడు ఈరవేణి పద్మారావు ముదిరాజ్, అడ్వైజర్ అలీమ్ ఖాన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగరావు, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు పాల్గొన్నారు.